

వైభవంగా కల్యాణోత్సవం..
దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరస్వామి కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు.
- 8లో ▸

రంజాన్ వేళలు
ఇఫ్తార్ మంగళ :6:32
సహర్ బుధ : 5:00

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 37.9 /18.2
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి.
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.
పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.
రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అనుమతి లేకుండా మరమ్మతులు చేపట్టొద్దు



లింగంపేట(ఎల్లారెడ్డి): అధికారుల అనుమతి లేకుండా రైతులు, ప్రైవేట్ వ్యక్తులు వ్యవసాయ క్షేత్రాల్లోని విద్యుత్ లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేపట్టొద్దని ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ సూచించారు. మండలంలోని నల్లమడుగు గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రాల్లో సోమవారం నిర్వహించిన 'రైతు పొలంబాట' కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులతో మాట్లాడారు. బోరుమోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని, లూజ్ వైర్లు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏ సమస్య వచ్చినా లైన్‌మెన్‌ల ద్వారా మరమ్మతులు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ విజయసారథి, ఏడీ మల్లేశ్, ఏఈ హరీశ్‌రావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి డీఎస్పీగా శ్రీనివాస్ రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట సైబర్ క్రైం డీఎస్పీగా విధులను నిర్వర్తించిన ఆయన బదిలీపై వచ్చారు. శ్రీనివాసరావుకు బదిలీపై వెళ్తున్న డీఎస్పీ శ్రీనివాసులు స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో సీఐ రవీందర్‌నాయక్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి, లింగంపేట ఎస్సైలు మహేశ్, ఆంజనేయులు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 10,303 మంది విద్యార్థులకు గాను 9,892 మంది హాజరుకాగా, 411 మంది గైర్హాజరయ్యారు. ఇందులో 8217 మంది జనరల్ విద్యార్థులకుగాను 7964 మంది హాజరు కాగా 253 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ కోర్సు పరీక్షకు 2,086 మందికి గాను 1928 హాజరు కాగా 158 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలను జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పర్యవేక్షించారు.

బిల్లుల గోల!

పీఏవో, ట్రెజరీల్లో మూలుగుతున్న చెక్కులు

- మరో పది రోజుల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- మళ్లీ చెక్కులు రాయించుకోవాల్సిన దుస్థితి
- జిల్లాలో రూ.213 కోట్ల బకాయిలు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మరో పది రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. వివిధ బిల్లుల కోసం ఉద్యోగులతోపాటు, ఉద్యోగ విరమణ పొందిన వాళ్లు, అలాగే ప్రభుత్వ కాంట్రాక్టు పనులు చేసిన కాంట్రాక్టర్లు ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. చాలా కాలంగా చెల్లింపులు లేకపోవడం, మార్చి నెలాఖరులో ప్రభుత్వం కనికరిస్తుందేమోనన్న ఆశతో ఆయా కార్యాలయాలకు వెళ్లి తమ బిల్లుల గురించి అడిగి తెలుసుకుంటున్నారు. గడిచిన రెండు, మూడేళ్ల కాలంలో చేసిన కాంట్రాక్ట్ పనులకు సంబంధించి బిల్లులు రికార్డు చేయించుకుని చెక్కులను ట్రెజరీల్లో అప్పగించినా ఖజానా ఫ్రీజింగ్‌తో చెల్లింపులు జరగడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు చాలా మంది ఏడాది కాలానికి పైగా బిల్లుల కోసం తిరుగుతున్నారు. కొన్ని పనులకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో చెల్లింపులు జరగకుంటే వచ్చే ఆర్థిక సంవత్సరంలో మళ్లీ చెక్కులు రాయించాల్సిందే.

పనులు పూర్తి చేసేందుకు పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ చెక్కులు రాయించుకోవాలంటే మళ్లీ అధికారుల చేతులు తడపాల్సిందే! కామారెడ్డి జిల్లా ఖజానా కార్యాలయాల్లో 3,828 బిల్లులకు సంబంధించి రూ.158.08 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇందులో అదర్ బిల్స్ కింద 2,040 బిల్లులకు రూ.118.92 కోట్లు, సాలరీ బిల్లులు 14కు సంబంధించి రూ.43.67 లక్షలు, సప్లిమెంట్ బిల్లులు 1,774కు రూ.38.73 కోట్లు రావాల్సి ఉంటుంది. అలాగే పే అండ్ అకౌంట్స్ డిపార్టుమెంట్‌లో నాలుగు వందలకుపైగా బిల్లులకు సంబంధించి దాదాపు రూ.55 కోట్లు రావాల్సి ఉన్నట్టు తెలుస్తోంది. రెండింటిని కలిపితే రూ.213 కోట్ల మేర ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, కాంట్రాక్టర్లకు రావాల్సి ఉంది.

మెటల్ కాంపోనెంట్ కింద జిల్లాలో చేపట్టిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు సంబంధించి గతేడాది జూలై 10 వరకు చెల్లింపులు జరిగాయి. మరో రూ.5 కోట్ల మేర చెల్లింపులు జరగాల్సి ఉంది. ఇవేకాకుండా గత జనవరిలో, ఇటీవల ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత

ఎన్‌ఆర్‌ఈజీఎస్ బిల్లులూ పెండింగ్‌లోనే...

ప్రభుత్వం మెటల్ కాంపోనెంట్ కింద మరో రూ.42 కోట్లకు ప్రొసీడింగ్స్ ఇచ్చింది. ఈ పనులన్నింటినీ వెంటనే పూర్తి చేసి ఈ నెలాఖరులోపు బిల్లులు జనరేట్ చేసుకోవాలి. దీంతో కాంట్రాక్టర్లు ఆయా పనులను పూర్తి చేసేందుకు పరుగులు తీస్తున్నారు. పనులు పూర్తి చేసి రికార్డు చేయించుకుని బిల్లులు సబ్‌మిట్ చేయాల్సి ఉంటుంది. కాగా ఇప్పటికే పెండింగులో ఉన్న బిల్లుల కోసం ఎంతో మంది కాంట్రాక్టర్లు ఆశగా ఎదురుచూస్తున్నారు. పాత బిల్లులు చెల్లించిన తరువాతే కొత్తవి చెల్లించే అవకాశం ఉంటుంది.

ఈ ఆర్థిక సంవత్సరం మరికొద్ది రోజుల్లో ముగియనుండడంతో అటు ఉద్యోగులు, ఉద్యోగవిరమణ పొందిన వారు ఇటు ప్రభుత్వం పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే చెక్కులు సమర్పించిన వారు ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ ఆఫీస్‌లకు ప్రతి రోజూ వెళ్తున్నారు. మార్చి ముగిసేలోగా తమ బిల్లులు మంజూరుకాకపోతే కథ మొదటికొస్తుందని, మళ్లీ చెక్కులు రాయించి ఎదురు చూడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

పది రోజులే కీలకం..

ప్రభుత్వ బిల్లుల చెల్లింపులకు ఈ పది రోజులే కీలకం. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ట్రెజరీ, పీఏవో కార్యాలయాలకు చేరుకుని అక్కడి అధికారులను బతిమాలుతున్నారు. ఏ అవకాశం ఉన్నా మా బిల్లులు ఇప్పించండి మహాప్రభో అంటూ వేడుకుంటున్నారు. అయితే తమ చేతిలో ఏదీ లేదని, అంతా పైనుంచే అని చెబుతూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. అయినప్పటికీ ఏదో రకంగా బిల్లులు సాధించుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఉద్యోగుల మెడికల్ బిల్స్‌తోపాటు వివిధ బిల్లులు రాకపోవడంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఉద్యోగ విరమణ చేసిన వాళ్లు కూడా నెలల తరబడిగా ఎదురుచూస్తున్నారు. తమకు రావాల్సిన అన్ని ప్రయోజనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కోర్టును కూడా ఆశ్రయించారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న సందర్భంలో ప్రభుత్వం ఏమేరకు చెల్లింపులు చేస్తుందో చూడాలి.

జిల్లాలో తహసీల్దార్ల బదిలీ

- 15 మందికి స్థాన చలనం
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ సంగ్వాన్

నిజాంసాగర్(జుక్కల్): జిల్లాలో 15 మంది తహసీల్దార్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల వివరాలు..

తహసీల్దార్	ప్రస్తుతం	బదిలీ
యూ సురేశ్	బిచ్కుంద	రాజంపేట
రేణుకా చౌహాన్	దోంగ్లి	లింగంపేట
హిమబిందు	జుక్కల్	పాల్వంచ
వేణుగోపాల్	పిట్లం	బిచ్కుంద
మహేందర్‌కుమార్	ఎల్లారెడ్డి	జుక్కల్
రాజానరేందర్‌గౌడ్	లింగంపేట	దోంగ్లి
సతీశ్‌రెడ్డి	గాంధారి	మాచారెడ్డి
అనిల్‌కుమార్	రాజంపేట	పిట్లం
సువర్ణ	రామారెడ్డి	డీఏవో, సబ్‌కలెక్టర్, బాన్సువాడ
శ్వేత	మాచారెడ్డి	గాంధారి
జయంత్‌రెడ్డి	పాల్వంచ	కలెక్టరేట్
విజయ్‌కుమార్	సబ్ కలెక్టర్ బాన్సువాడ	కలెక్టరేట్, డిప్యుటేషన్ ఆర్డీవో ఎల్లారెడ్డి
ప్రేమ్‌కుమార్	డిప్యుటేషన్ ఆర్డీవో, ఎల్లారెడ్డి	కలెక్టరేట్
సరళాబాయి	సూపరింటెండెంట్, కలెక్టరేట్	ఎల్లారెడ్డి
ఉమాలత	సూపరింటెండెంట్, కలెక్టరేట్	రామారెడ్డి

అంగన్‌వాడీల మహా ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కామారెడ్డి టౌన్: తమ డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని, వేసవి సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటి పిలుపు మేరకు 48 గంటల పాటు ధర్నా చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ధర్నాలో పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ చేయాలి
- ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలి
- పనులు జరుగుతున్న చోట్ల నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలి
- వీసీలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాలు

కామారెడ్డి క్రైం: నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా మండలాల అధికారులతో ఇందిరమ్మ ఇండ్లు, ఎల్‌ఆర్‌ఎస్, పన్ను వసూళ్లు, తాగు నీరు, ఉపాధిహామీ, నర్సరీల నిర్వాహణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉన్న అర్హులకు వెంటనే మార్క్ అవుట్ ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే చేపట్టిన మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తిచేయాలన్నారు. లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఈ నెల 31వ తేదీ నాటికి 25 శాతం రాయితీ ఉందన్నారు. ఈ మేరకు దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలని, ఆర్డీవోలు, సబ్ కలెక్టర్లు పర్యవేక్షించాలని అన్నారు. నెలాఖరు లోగా వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. జిల్లాలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరం మేరకు అద్దె బోర్లు నుంచి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరై ఇప్పటికీ ప్రారంభించని పనులను రద్దు చేసి, వాటి స్థానంలో సీసీ రోడ్డు పనులు చేపట్టాలని ఇదివరకే సూచించామని గుర్తుచేశారు. నెలాఖరు లోగా ఆయా సీసీ రోడ్ల పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని, పనులు జరిగే ప్రాంతంలో నీడ, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు సిద్ధంగా ఉంచాలన్నారు. వీసీలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వి విక్టర్, జెడ్పీ సీఈవో చందర్, డీఆర్డీవో సురేందర్, హౌసింగ్ పీడీ విజయాపాల్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళారులే దిక్కు..!

- ఏర్పాటు కాని జొన్న కొనుగోలు కేంద్రాలు
- తక్కువ ధరకే దళారులకు విక్రయిస్తున్న రైతులు



టీకారం తండాలో జొన్నలను దళారులకు విక్రయించేందుకు సంచుల్లో నింపుతున్న రైతులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): తెల్ల జొన్న సకాలంలో చేతికొచ్చినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటి వరకు మద్దతు ధర సైతం ప్రకటించింది లేదు. ఇక తమకు దళారులే దిక్కంటూ తక్కువ ధరకే పంట దిగుబడిని రైతులు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతోపాటు భూగర్భజలాలు అడుగంటిపోయే పరిస్థితిని ఊహించి జొన్న సాగు చేశారు. పెద్దకొడప్‌గల్ మండలం పరిధిలో మొత్తం 10,500 ఎకరాల విస్తీర్ణంలో జొన్నసాగైనట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అలాగే జుక్కల్, పిట్లం, బిచ్కుంద, మద్నూర్ మండలాల రైతులు సైతం జొన్నసాగు చేశారు. పంట సకాలంలో చేతికి అందగా, పెద్దకొడప్‌గల్ మండలంలో ఇప్పటికే 60 శాతం పంట కోతలు పూర్తయ్యాయి. మద్దతు ధరపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం, కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకాకపోవడంతో జొన్నలను రైతులు దళారులకు రూ.2,200 నుంచి రూ.2,300కు విక్రయించేస్తున్నారు. గతేడాది రూ.3,180 మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన ప్రభుత్వం ఈ ఏడాది ఇప్పటి వరకు ముందుకు రాకపోవడంతో తాము నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరుతున్నారు.

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో చాలా మంది రైతులు జొన్న సాగువైపు మొగ్గు చూపారు. నేను ఎనిమిది ఎకరాల్లో జొన్న సాగు చేశాను. గత ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా రూ.3,180 మద్దతు ధర చెల్లించి జొన్నలు కొనుగోలు చేసింది. ఈ ఏడాది కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. – వెంకన్న పటేల్, రైతు, పెద్దకొడప్‌గల్

కౌలు భూమిలో సాగు చేశా



నేను ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని జొన్న సాగు చేశా. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తేనే ఎంతోకొంత గిట్టుబాటు అవుతుంది. లేదంటే దళారులకు పంట విక్రయిస్తే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. అధికారులు ఇకనైనా స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి. – భీమ్‌సింగ్, రైతు, టీకారం తండా

ఉత్తర్వులు రాలేదు

జొన్న కొనుగోలుపై ప్రభుత్వం, మార్క్‌ఫెడ్ నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ఉత్తర్వులు వచ్చిన వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. – సందీప్, పీఏసీఎస్ కార్యదర్శి, పెద్దకొడప్‌గల్

అసెంబ్లీలో గొంతెత్తిన జిల్లా ఎమ్మెల్యేలు

నాగిరెడ్డిపేట/కామారెడ్డి టౌన్: జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సోమవారం అసెంబ్లీలో పలు అంశాలపై మాట్లాడారు. ఎల్లారెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, కాటిపల్లి వెంకటరమణారెడ్డి వివిధ అంశాలను లేవనెత్తారు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



ఎల్లారెడ్డిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు కోరారు. నాగిరెడ్డిపేట, లింగంపేట, తాడ్వాయి, రామారెడ్డి మండలాల్లోని పర్యాటకప్రాంతాలతోపాటు పలు దేవస్థానాల గురించి వివరించారు. పోచారం ప్రాజెక్టుతో పాటు అక్కడే ఉన్న నిజాంకాలంనాటి అతిథిగృహాలను, పోచారం అభయారణ్యాన్ని ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే త్రిలింగేశ్వర, కాలభైరవస్వామి, భీమేశ్వరాలయాల వద్ద సౌకర్యాలు కల్పించాలని, నాగన్నబావిని పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందిస్తూ నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు, నాగన్న బావి అభివృద్ధి చేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని సమాధానమిచ్చారు.

ఎమ్మెల్యేగా చెప్పినా పనులు కావడం లేదు



ఎమ్మెల్యేగా తాను చెప్పినా కామారెడ్డి నియోజకవర్గంలో పనులు కావడం లేదని కాటిపల్లి వెంకటరమణారెడ్డి సభలో వాపోయారు. ఓడిపోయి వారు చెప్పిన వాటికి మాత్రం నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. తాను రాష్ట్ర ప్రభుత్వానికి 84 ప్రశ్నలు అడిగితే ఇప్పటివరకు కనీసం 9శాతం ప్రశ్నలకు కూడా జవాబు చెప్పలేదన్నారు. అధికారులు వచ్చి తన ఎదురుగా నిలబడాలని కోరుకోవడం లేదని, రాజకీయాల్లో హుందాగా ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు.

కదిలిన అధికార యంత్రాంగం



నాగిరెడ్డిపేటలోని గోపాల్‌పేట ఎస్సీ కాలనీలో పైపులైన్ సరి చేయిస్తున్న అధికారులు



గాంధారి మండలం సోమ్లానాయక్ తండా జీపీలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

- 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్‌కు స్పందన
- పలు గ్రామాలను సందర్శించిన అధికారులు
- నీటి సరఫరా, ఎద్దడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ

సాక్షి ఎఫెక్ట్..

నాగిరెడ్డిపేట/గాంధారి(ఎల్లారెడ్డి): జిల్లాలో తాగు నీటి సమస్యపై 'సాక్షి'లో సోమవారం గ్రౌండ్ రిపోర్ట్ ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్లి సమస్య తీవ్రతను తెలుసుకున్నారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలోని ఎస్సీ కాలనీని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య సందర్శించారు. కాలనీకి మిషన్ భగీరథ నీరు సరఫరా చేసే పైప్‌లైన్‌లో సమస్య ఉందని, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

గాంధారి మండలం సోమ్లానాయక్ తండాను డీపీవో మురళి, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, డీఎల్పీవో సురేందర్, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్ సందర్శించారు. తండా శివారులోని వ్యవసాయ బావిని పరిశీలించి తాగు నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బోరు వేయిస్తామని అప్పటి వరకు ట్యాంకర్‌తో నీరు సరఫరా చేస్తామన్నారు. తమ సమస్యను త్వరగా పరిష్కరించాలని తండావాసులు అధికారులను కోరారు.

సోమ్లానాయక్ తండాలో సమస్యను పరిష్కరిస్తాం

కామారెడ్డి క్రైం: గాంధారి మండలం సోమ్లానాయక్ తండాలో నీటి సమస్య లేకుండా సమస్యను పరిష్కరిస్తామని మిషన్ భగీరథ ఎస్‌ఈ రాజేంద్ర కుమార్ అన్నారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తండాలో 310 జనాభాకు గాను 68 నీటి కుళాయి కనెక్షన్‌లు, 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచి నీటి ట్యాంకు ఉన్నాయని తెలిపారు. సింగిల్ ఫేజ్ మోటారు ద్వారా నీటి సరఫరా అవుతోందని, బోరు బావిలో నీరు అడుగంటి సమస్య తలెత్తిందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ సమస్య!

- మీసేవ యాప్‌లో నమోదు చేసినా అప్డేట్ కావట్లేదు
- హార్డ్ కాపీ సబ్మిట్ చేయాలంటున్న ట్రెజరీ అధికారులు
- యాప్‌లో సాంకేతిక లోపాలే సమస్యకు కారణం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ప్రభుత్వ పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ సమస్య తలనొప్పిగా మారింది. ఏడాదికోసారి తాము బతికే ఉన్నామంటూ లైఫ్ సర్టిఫికెట్‌ను ట్రెజరీ కార్యాలయంలో ఇవ్వాల్సి ఉంటుంది. అయితే గత ప్రభుత్వం టీ యాప్ ఫోలియో యాప్‌లో లైఫ్ సర్టిఫికెట్ సబ్మిట్ చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో చాలా మంది పెన్షనర్లు ఇంటి దగ్గరి నుంచే యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకునేవారు. అయితే ప్రభుత్వం మారిన తరువాత యాప్‌లో మార్పులు తీసుకువచ్చారు. టీ యాప్ ఫోలియోను మీసేవా యాప్‌గా మార్చారు. అందులో తమ వివరాలు నమోదు చేసుకున్న పెన్షనర్లు సక్సెస్ అని చూపడంతో పని అయిపోయిందనుకున్నారు. కానీ ట్రెజరీలో మాత్రం అప్‌డేట్ కావడం లేదు. దీనిపై ట్రెజరీ నుంచి పెన్షనర్లకు 'తమరి లైఫ్ సర్టిఫికెట్' కార్యాలయంలో సబ్మిట్ చేయాలంటూ మెసేజ్‌లు వస్తున్నాయి. తాము యాప్‌లో సబ్మిట్ చేశామని సమాధానం ఇస్తే, అప్‌డేట్ కాలేదని సర్టిఫికెట్ ఇవ్వాలని సూచిస్తున్నారు. ఎక్కడో పిల్లల దగ్గరకు వెళ్లి ఉంటున్న వారు, వృద్ధాప్యంతో ఇంటి వద్దే ఉంటున్న వారు ఎవరో ఒకరి సాయంతో యాప్‌లో నమోదు చేసుకున్న వివరాలు అప్‌డేట్ కాక, తిరిగి కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది రాష్ట్ర వ్యాప్తంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్య. మీ సేవా కేంద్రాల్లో కూడా నమోదు చేసుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ కేంద్రాల్లో కొందరు ఆన్‌లైన్ సరిగా పనిచేయడం లేదని, మరే కారణమో చెబుతూ రిటర్న్ పంపుతున్నారు. తాను నాలుగు కేంద్రాలకు తిరిగానని ఓ పెద్దాయన 'సాక్షి'తో ఆవేదన వ్యక్తం చేశారు. మీ సేవా యాప్‌లో నమోదు చేసిన వివరాలు అప్‌డేట్ కావడం లేదంటూ ట్రెజరీ నుంచి పెన్షనర్లకు సమాచారం రావడంతో ఖంగుతింటున్నారు. ఒక్క కామారెడ్డి జిల్లాలోనే 350 మంది పెన్షనర్ల వివరాలు అప్డేట్ కాలేదని తెలుస్తోంది. అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కే వేణుగోపాల్ అన్నారు. యాప్ ద్వారా ఎంతో మంది తమ వివరాలను సులువుగా నమోదు చేసుకుంటున్నారని, యాప్‌ను అప్డేట్ చేయాలని సూచించారు.

క్లుప్తంగా

వడదెబ్బ నివారణ చర్యలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వెంకటరమణ

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రితో పాటు పలు చోట్ల వడ దెబ్బ తగులకుండా తీసుకోవాల్సిన చర్యలను ఎంపీహెచ్ఈవో వెంకటరమణ సోమవారం అవగాహన కల్పించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు బయట తిరగొద్దని సూచించారు. అలాగే ఎక్కడ పడితే అక్కడ నీటిని తాగవద్దని శుభ్రమైన నీరునే సేవించాలన్నారు. వాంతులు విరేచనాలు అయితే వెంటనే వైద్యసిబ్బందిని సంప్రదించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను వినియోగించే విధానంపై అవగాహన కల్పించారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపిక


ఎంపికైన వెన్నెల

నిజాంసాగర్(జుక్కల్):టీజీపీఎస్సీ సోమవారం విడుదల చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగానికి మహమ్మద్ నగర్ మండలం దూప్‌సింగ్ తండాకు చెందిన కొర్ర వెన్నెల ఎంపికైంది. రాజన్న సిరిసిల్లా జోన్ పరిధిలో మహిళా విభాగంలో వెన్నెల 180 మార్కులతో మూడో ర్యాంక్ సాధించింది. ఈసందర్భంగా వెన్నెలను తండావాసులు అభినందించారు.

రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి


వినతిప్రతం అందజేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్ : రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పౌరసరఫరా శాఖ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఇంకో 20 రోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. తరుగు పేరిట అక్రమాలకు పాల్పడే రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, వసంత్ తదితరులున్నారు.

ప్రత్యేకాధికారుల జాబితాలో మార్పులు

కామారెడ్డి క్రైం: మండల ప్రత్యేకాధికారుల జాబితాలో మార్పులు చేస్తూ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఆరు మండలాలకు కొత్తగా ప్రత్యేకాధికారులను నియమించారు. జుక్కల్ మండలానికి జెడ్పీ సీఈవో చందర్, సదాశివనగర్‌కు భూగర్భ జల శాఖ ఏడీ సతీశ్‌యాదవ్, పాల్వంచకు జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, గాంధారికి డీపీవో మురళి, మాచారెడ్డికి మిషన్ భగీరథ ఈఈ డి రమేశ్, ఎల్లారెడ్డికి డీఎల్‌పీవో సురేందర్‌ను మండల ప్రత్యేకాధికారులుగా నియమించారు.

నూతనంగా నియమితులైన ప్రత్యేకాధికారులు వారికి కేటాయించిన మండలాల్లో క్రమం తప్పకుండా పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మంగళ, శుక్ర వారాల్లో గ్రామాలను సందర్శించాలని సూచించారు. ప్రజాపాలన, తాగు నీరు, ఇందిరమ్మ ఇండ్లు, స్వచ్ఛదనం-పచ్చదనం, పారిశుద్ధ్యం, హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, నర్సరీల నిర్వహణ తదితర ప్రభుత్వ కార్యక్రమాల అమలును పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 145 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 145 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో భూ సంబంధిత, డబుల్ బెడ్రూం ఇండ్లు, పింఛన్ లకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దన్నారు. తీసుకున్న చర్యలకు సంబంధించిన సమాచారాన్ని ఫిర్యాదుదారునికి తప్పనిసరిగా అందజేయాలన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, జెడ్పీ సీఈవో చందర్, ఏవో మస్రూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలి



నిరుపేద కుటుంబాలకు చెందిన తమకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ ఎల్లారెడ్డి పట్టణంలో ఎర్రమన్నుకుచ్చ ప్రాంతానికి చెందిన దాదాపు 40 మంది కలెక్టరేట్‌కు తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. ఎల్లారెడ్డిలో దాదాపు 300 డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించారని తెలిపారు. బుడగజంగాల కులానికి చెందిన తాము ఎన్నో ఏళ్లుగా గుడెసెలు వేసుకుని ఈ ప్రాంతంలో నివసిస్తున్నామని వెల్లడించారు. ఈ విషయమై ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. – ఎర్రమన్నుకుచ్చ గ్రామస్తులు, ఎల్లారెడ్డి

భూమి కబ్జాకు యత్నిస్తున్నారు



గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తన భూమిని కబ్జా చేయడానికి యత్నిస్తున్నారనీ, వారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ పాల్వంచ మండలం భవానీపేట గ్రామానికి చెందిన గంగాని చిన్న నర్సింలు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించాడు. అతను మాట్లాడుతూ.. గ్రామ శివారులోని సర్వే నెంబరు 841 లో 2.37 ఎకరాల స్వంత భూమి ఉందన్నాడు. కొద్ది రోజులుగా అదే గ్రామానికి చెందిన కొందరు భూమి ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడటమే కాకుండా దాడులకు సైతం దిగుతున్నారని వాపోయాడు. చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరాడు.
– గంగాని చిన్న నర్సింలు, భవానీపేట, పాల్వంచ మండలం

సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలి

- పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి
- ఎస్పీ రాజేశ్ చంద్ర ఆదేశం
- పలు పోలీస్‌స్టేషన్ల తనిఖీ


మద్నూర్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర


బిచ్కుందలో చిల్డ్రన్ పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

మద్నూర్/బిచ్కుంద/నిజాంసాగర్/పెద్దకొడప్‌గల్(జుక్కల్): మద్నూర్ మండలం రాష్ట్ర సరిహద్దులో ఉండడంతో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. మద్నూర్, నిజాంసాగర్, పెద్దకొడప్‌గల్ పోలీస్ స్టేషన్లను సోమవారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లోని గదులను, సిబ్బంది క్వార్టర్లను ఎస్పీ పరిశీలించారు. ఆయా స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఆరా తీసి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. న్యాయం త్వరగా జరిగేలా చూడాలన్నారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఇతర ప్రాంతాల నుంచి ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే అదుపులోకి తీసుకోని విచారించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. పేకాట, అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పెద్దకొడప్‌గల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం మండలంలోని సలాబత్‌పూర్ వద్ద తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దును పరిశీలించారు.

చిల్డ్రన్ ప్లే పార్క్ ప్రారంభించిన ఎస్పీ

బిచ్కుంద పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ రాజేష్ చంద్ర చిల్డ్రన్ ప్లే పార్క్‌ను ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ సందర్శించి రికార్డులు పరిశీలించి సమస్యలు, క్రైమ్ రికార్డుల వివరాలు తెలుసుకున్నారు. సరిహద్దులో ప్రత్యేక నిఘా ఉంచాలని, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీఐ నరేష్‌కు సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట బాన్సువాడ డీఎస్పీ సత్యానారాయణ, బిచ్కుంద సీఐ నరేష్, రూరల్ సీఐ రాజేశ్, ఎస్సైలు మోహన్‌రెడ్డి, శివకుమార్, ఏఎస్సై సుధాకర్, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా


మద్నూర్‌లో ఫేర్‌వెల్ పార్టీలో పాల్గొన్న పదో తరగతి విద్యార్థులు

మద్నూర్(జుక్కల్)/లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం, పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సరస్వతి మాత చిత్రపటానికి పూల మాలలు వేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి మల్లేశం మాట్లాడారు. అలాగే లింగంపేట మండలం శెట్పల్లి ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎంలు నాగ్‌నాథ్, వసుధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఇందల్వాయి: ఇందల్వాయి ఉన్నత పాఠశాలలో సోమవారం 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 18ఏళ్ల తర్వాత వారంత కలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. లోకాని గోపి, మారంపల్లి శ్రీకాంత్, అశోక్, సువర్ణ, స్వప్న, లావణ్య తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

ఠాణాకు తరలివచ్చిన మహిళలు


బాల్కొండ పోలీస్‌స్టేషన్ వద్ద మహిళలు

బాల్కొండ: మండలంలోని బస్సాపూర్ గ్రామానికి చెందిన కొందరు మహిళలు సోమవారం బాల్కొండ పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. తమను గ్రామంలో ఓ కుల సంఘానికి చెందిన కొందరు వ్యక్తులు బూతులు తిడుతున్నారని, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఎస్సై నరేష్‌కు ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అత్త ఇంట్లో చోరీకి పాల్పడిన అల్లుడు

- ఈనెల 9న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఘటన
- నిందితుడిని పట్టుకున్న పోలీసులు

ఖలీల్‌వాడి: అత్త ఇంట్లో అల్లుడు చోరీకి పాల్పడిన ఘటన నిజామాబాద్ నగరంలో చోటుచేసుకుంది. కొన్నిరోజుల క్రితం ఘటన చోటుచేసుకోగా, నిందితుడిని పట్టుకున్నట్లు నాలుగోటౌన్ ఎస్సై శ్రీకాంత్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని రోటరీ నగర్‌కు చెందిన సభావత్ సక్కుబాయి ఈనెల 9న ఉదయం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. మధ్యాహ్నం ఇంటి తలుపులు తెరిచిఉండటంతో ఇంటి దగ్గర్లోనే ఉన్న ఆమె కూతురు గమనించి సక్కుబాయికి సమాచారం అందించింది. సక్కుబాయి ఇంటికి వచ్చి చూసి చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చి పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సాంకేతికత ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి అలుడైన ధరావత్ సంతోష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా తానే చోరీ చేసినట్లు అతడు ఒప్పుకున్నాడు. సంతోష్ వద్ద నుంచి సుమారు 8 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించిన టౌన్ సీఐ శ్రీనివాస్‌రాజ్, ఎస్సై శ్రీకాంత్, సిబ్బందిని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి అభినందించారు.

మద్యంమత్తులో స్నేహితుడిపై గొడ్డలితో దాడి

మాక్లూర్: మద్యం మత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య మాటమాట పెరిగి గొడవ జరుగగా, ఒకరు గొడ్డలితో దాడి చేసి స్నేహితుడిని గాయపర్చారు. మండలంలోని కల్లెడి గ్రామంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కల్లెడి గ్రామానికి చెందిన దేవతి పోశెట్టి, తెడ్డు లింగం ఇద్దరు ప్రాణస్నేహితులు. పోశెట్టి 3 నెలల క్రితం దుబాయ్ నుంచి స్వగ్రామం వచ్చాడు. తిరిగి ఈనెల 17న దుబాయ్ వెళ్లాల్సి ఉంది. ఈసందర్భంగా పోశెట్టి, లింగం విందు చేసుకున్నారు. మద్యం మత్తులో పోశెట్టి, లింగంను అనరాని మాట అనడంతో ఆగ్రహంతో గొడ్డలితో దాడి చేసినట్లు తెలుస్తుందని పోలీసులు తెలిపారు. బాధితుడు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు లింగంను అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు.

బోధన్ రూరల్ సీఐకి మెమో జారీ

ఖలీల్‌వాడి: బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబుపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సోమవారం సీపీ పోతరాజు సాయిచైతన్య చార్జ్ మెమో అందించారు. ఇటీవల ఎడపల్లి మండలం జానకంపేట లక్ష్మీనరసింహస్వామి జాతరలో బోయి భాగ్య అనే మహిళ పర్సు పోగొట్టుకుంది, దీంతో ఆమె అక్కడే ఉన్న బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబుకు ఫిర్యాదు చేయగా సదరు మహిళను సీఐ విజయ్‌బాబు కొట్టారు. దీనిపై ప్రజావాణిలో కలెక్టర్‌కు, బోధన్ ఏసీపీకి బాధితురాలు ఫిర్యాదు చేశారు. సీపీ పూర్తిస్థాయి విచారణ జరిపి క్రమశిక్షణ చర్యల్లో భాగంగా చార్జ్ మెమో ఇచ్చారు.

పాత సీఎస్ఐ స్కూల్‌లో అగ్నిప్రమాదం



ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్‌లోని పాత సీఎస్ఐ స్కూల్‌లో సోమవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. పాఠశాలలోని స్టోర్‌రూం నుంచి అకస్మాత్తుగా మంటలు రావడంతో స్థానికులు అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేసినట్లు అగ్నిమాపకశాఖ అధికారి నర్సింగ్ రావు తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలోని పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా పేకాడుతున్న నలుగురిని పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ.3338 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా సిద్దరామేశ్వరస్వామి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు.. పాల్గొన్న భక్తులు

- భారీగా తరలివచ్చిన భక్తులు
- భక్తి శ్రద్ధలతో అగ్నిగుండాలు, కాషాయ పతాకావిష్కరణ


సిద్ధగిరి సమాధి వద్ద కాషాయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి సదాశివమహంత్

భిక్కనూరు : దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్దరామేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. వేదబ్రాహ్మణులు సిద్దగిరిశర్మ, రామగిరిశర్మ, రాజేశ్వరశర్మ, సిద్దేశ్‌ల ఆధ్వర్యంలో మాత భువనేశ్వరీదేవితో స్వామి వారి కల్యాణం కనులపండువగా జరిపారు. వేకువజామున వీరభద్ర స్వామి ఆలయం వద్ద తమ కొర్కెలు నెరవేరాలని భక్తులు అగ్నిగుండాలను తొక్కారు. ఆలయం ప్రధాన మండపంలో దక్ష యజ్ఞం జరిపించారు. తదుపరి బాజభజంత్రీలతో ఆలయ పీఠాధిపతి సదాశివమహంత్ ఆలయం నుంచి శ్రీసిద్దగిరి సమాధి వద్దకు వచ్చి అక్కడ పూజా కార్యక్రమాలను నిర్వహించి కాషాయపతాకాన్ని ఎగురవేశారు. భక్తులకు హైకోర్టు న్యాయవాది పెద్దబచ్చగారి రాంరెడ్డి-కృష్ణవేణి దంపతులు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషన్ శ్రీరాం రవీందర్, ఈవో శ్రీధర్‌తో, ఆలయ పునర్‌నిర్మాణకమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ లింబాద్రి, మాజీ ఎంపీపీలు బల్యాల రేఖ సుదర్శన్, గాలిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, తున్కివేణు, తదితరులు పాల్గొన్నారు.


అగ్నిగుండాలు తొక్కుతున్న భక్తులు

ఇష్టపడి చదివితే మంచి మార్కులు


జంగంపల్లిలో విద్యార్థులతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి
- విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల అందజేత

భిక్కనూరు: విద్యార్థులు చదువును కష్టం అనుకోకుండా ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జంగంపల్లిలో కస్తూర్బా పాఠశాలతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, హెచ్ఎం రాజేంద్రప్రసాద్, కేజీబీవీ ఎస్‌వో హరిప్రియ, మాజీ ఎంపీపీ గాలిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ స్వామి కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యాక్షులు లింగారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మమత, నాయకులు మూర్తి ప్రకాశ్‌గౌడ్, రామస్వామి,బాబు, ఆమీర్, నర్సింలు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ

బీబీపేట/నిజాంసాగర్/తాడ్వాయి/కామారెడ్డి రూరల్/పిట్లం/మాచారెడ్డి/బాన్సువాడ రూరల్ : బీబీపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ శ్రీగాధ శంకర్ పరీక్షల సామగ్రి వితరణ చేశారు. జుక్కల్ మండలం పెద్ద ఎడ్గి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జుక్కల్ యూత్ ఫోరం ఆధ్వర్యంలో, తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ ఉన్నతపాఠశాలలో కాంప్లెక్స్ హెచ్ఎం సంగారెడ్డి ఆధ్వర్యంలో, కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ జెడ్పీపాఠశాలలో సేవా భారతి ఆధ్వర్యంలో, పిట్లం మండలం చిన్నకొడప్‌గల్ జెడ్పీ పాఠశాలలో లయన్స్ క్లబ్, మాచారెడ్డి మండలంలోని సోమారంపేట ఉన్నత పాఠశాలలో బంజారా టైగర్స్ స్వచ్ఛంద సంస్థ, పాల్వంచ మండలం భవానీపేట ఉన్నత పాఠశాలలో మాజీ ఉపసర్పంచ్ రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో, బాన్సువాడ మండలం చిన్న రాంపూర్ జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం వీరప్ప పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, కంపాక్స్ బాక్స్‌లు అందజేశారు.

నస్రుల్లాబాద్‌లో ఒకరి ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బాన్సువాడకు చెందిన ఓ వ్యక్తి నస్రుల్లాబాద్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నస్రుల్లాబాద్ చెరువులో సోమవారం ఓ వ్యక్తి మృతదేహం కనబడటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు బాన్సువాడ గ్రామానికి చెందిన కొత్తకొండ శ్రీనివాస్(53)గా గుర్తించారు. శ్రీనివాస్ విరిగిన కాలు తీవ్రంగా నొప్పి రావడంతో నిత్యం బాధపడేవాడు. ఈక్రమంలో ఈనెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. కాలు నొప్పి భరించలేకనే చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని భార్య అనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆభరణాలు ఎత్తుకెళ్లిన నిందితుల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజేశ్

నిజాంసాగర్(జుక్కల్): మహిళను నమ్మించి నగలు ఎత్తుకు వెళ్లిన ఆటో డ్రైవర్ సుందర్‌రాజుతోపాటు వడ్డే లక్ష్మిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు బాన్సువాడ రూరల్ సీఐ రాజేష్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. సంగారెడ్డి జిల్లా మార్డి గ్రామానికి చెందిన మ్యాతరి భూమవ్వ ఆదివారం అచ్చంపేట వెళ్లడానికి నిజాంసాగర్ బస్టాండ్ సమీపంలోని రోడ్డుపై నిల్చుంది. ఆటోలో వచ్చిన సుందర్‌రాజుతోపాటు వడ్డె లక్ష్మి కలిసి భూమవ్వను అచ్చంపేటకు తీసుకెళ్తామని నమ్మించి ఆటోలో ఎక్కించుకున్నారు. నిర్మానుష్య ప్రదేశంలో ఇద్దరు కలిసి భూమవ్వ మెడలోని రెండు తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకువెళ్లారు. సోమవారం బొగ్గు గుడిసె చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటో డ్రైవర్ పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా భూమవ్వ వద్ద చోరీకి పాల్పడినట్లు తెలిపారు. వెంటనే వారి వద్ద నుంచి పోలీసులు ఆభరణాలను స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. నిజాంసాగర్ ఎస్సై శివకుమార్, కానిస్టేబుళ్లు శ్యామ్, మహేష్‌లను సీఐ అభినందించారు.

ఆవుల యజమానులపై ఫిర్యాదు


వినతి పత్రం అందజేస్తున్న రైతులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన ఆవుల యజమానులపై లింగంపేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం స్థానిక రైతులు ఫిర్యాదు చేశారు. ఆవుల యజమానులు వారి పశువులను ఇష్టానుసారంగా వదిలేయడంతో పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు తెలిపారు. దీంతో పంటను నష్టపోతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో ఆవుల యజమానులు చేపూరి కృష్ణమూర్తి, శెట్పల్లి రాములు, మంగళి విఠల్, పోతపల్లి సాయిలుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతులు వెంకట్‌గౌడ్, గురుప్రసాద్, లక్ష్మన్, సాయిలు, ఆలియా, కాశీరాం, బాలయ్య తదితరులు ఉన్నారు.